క్లుప్తంగా

ఎమ్మెల్యే వంశీకృష్ణకు కసిరెడ్డి పరామర్శ


వంశీకృష్ణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: అచ్చంపేట శాసనసభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. వంశీకృష్ణ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని నగరంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి.. వంశీని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముస్లింల అభివృద్ధికే వక్ఫ్ సవరణ బిల్లు


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కమలనాథులు

ఆమనగల్లు: పార్లమెంటులో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాజీవ్ కూడలిలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ముస్లింల అభివృద్ధికి ప్రధాని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, మండల అధ్యక్షుడు శ్రీను, మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, నాయకులు నర్సింహ, భైకని శ్రీశైలంయాదవ్, చెన్నకేశవులు, పాషా, ప్రభాకర్, శ్రీను, మహేశ్, శ్రీనివాస్, జంగయ్య, శ్రీశైలంయాదవ్, బుచ్చయ్య, పారేశా, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలంటే పోటీ కాదు..


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: క్రీడలంటే పోటీ కాదు. వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు దోహదపడతాయని గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ కోహ్లి అన్నారు. శుక్రవారం విద్యాసంస్థలో క్రీడా మహోత్సవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి, అధ్యాపకుల మధ్య గురుశిష్య బంధాన్ని క్రీడోత్సవ్ బలోపేతం చేయనుందని తెలిపారు. విద్యాసంస్థల ప్రతినిధులు సైని, శ్రీనాథ్‌రెడ్డి, పార్థసారథి, ప్రిన్సిపాల్ వెంకట్‌రావు, డైరెక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ


బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

యాచారం: మండల పరిధి గ్రామాల్లో రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. చింతపట్ల, కుర్మిద్దలో శుక్రవారం అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు లబ్ధిదారులకు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి సుధాకర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర కార్యదర్శిగా 'లిక్కి'


వెంకట్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న జితేందర్

యాచారం: మండల పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన లిక్కి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్.. గాంధీభవన్‌లో నియామక పత్రం అందజేశారు. గతంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన వెంకట్‌రెడ్డి.. పార్టీ బలోపేతం కోసం ఎనలేని కృషి చేశాడు. దీనిని గుర్తించిన అధిష్టానం ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంకాల దాసు ఉన్నారు.

లోక కల్యాణానికి వేళాయె

- రేపు రాములోరి పెళ్లి
- వేడుకలకు ముస్తాబైన ఆలయాలు
- కవాడిపల్లిలో మూడు రోజులు ఉత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్: శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకొని మండల పరిధి కవాడిపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామచంద్రస్వామి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. రేపటి నుంచి మూడు రోజులు ఉత్సవాలు జరగనున్నాయి. తొలుత ఈ నెల 6న సాయంత్రం 6గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా జరగనుంది. 7న సాంస్కృతిక కార్యక్రమాలు, హోమాలు. 8న తెల్లవారు జామున రథోత్సవం, రావణ దహన, చక్రతీర్థం నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

త్రేతా యుగంలో తండ్రి ఆజ్ఞానుసారం శ్రీరాముడు వనవాసం చేస్తూ.. దండకారణ్యమైన అటవీ ప్రాంతంలో బస చేసినట్లు ప్రతీతి. ఇదిలా ఉండగా ఒకరోజు కొందరు భక్తులు సీతారామ లక్ష్మణ విగ్రహాలతో ఎడ్ల బండిపై ప్రయాణం చేసున్న క్రమంలో చీకటి పడింది. ఈ క్రమంలో వారు ఆ రాత్రికి అక్కడే నిద్రించారు. తెల్లవారు లేచి చూసే సరికి బండిలోని విగ్రహాలు కనబడలేదు. వాటి కోసం వెతకగా.. సమీపాన ఉన్న కొండపైన కనబడ్డాయి. ఇదంతా దేవుడు మాయేనని భావించిన ఆ భక్తులు.. ఆ విగ్రహాలను అక్కడే ప్రతిష్ఠించారు. ఈ ఆలయానికి కాపలాగా శేష నాగు ఉండేదని ప్రచారంలో ఉంది. నాడు గ్రామంలోని రైతులు పండించిన ధాన్యాన్ని కుప్పలుగా ఆలయ సమీపంలోనే పోసేవారని, అందులో నుంచి శేషనాగు వెళ్లి ధాన్యపు కుప్పను రెండు భాగాలుగా విభజిస్తే.. ఒక భాగం రైతులకు, మరో భాగంతో ఏటా సీతారాముల కల్యాణం నిర్వహించేవారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ ఆలయ నిర్మాణం ఎప్పుడు జరిగిందో తెలుసుకునేందుకు కచ్చితమైన చారిత్రక ఆధారాలు లేనప్పటికీ, ఆలయ నిర్మాణ శైలిని చూస్తే గోల్కొండ రాజ్యాన్ని పరిపాలించిన చివరి చక్రవర్తి అబుల్ హసన్ తానిషా పరిపాలనా కాలం నాటిదై ఉండొచ్చని పూర్వికుల అభిప్రాయం.

చైత్రశుద్ధ పాడ్యమి..

ఏటా చైత్రశుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు ఇక్కడ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ముఖ్యంగా నవమి రోజు జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరుగుతుంది. వీటితో పాటు హనుమాన్ జయంతి, కృష్ణాష్టమి, ధనుర్మాస ఉత్సవాలను ఈ ఆలయంలో నిర్వహిస్తారు. దాతల సహకారంతో అభివృద్ధి చెందుతున్న గుడిలో గతేడాది నుంచి ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నారు.


కవాడిపల్లిలో కోదండ రామచంద్రస్వామి ఆలయం

ఒకే రోజు రెండు సార్లు కల్యాణం

కవాడిపల్లిలోని కోదండ రామాలయంలో శ్రీరామ నవమి రోజున రెండు సార్లు సీతారాముల కల్యాణం నిర్వహించడం ఇక్కడి విశేషం. మొదటగా ఉదయం భద్రాద్రి రాముడి సన్నిధిలో నిర్వహించే కల్యాణ సమయంలో కొంతమంది జంటలతో ఆలయ ప్రాంగణంలో కల్యాణం జరిపిస్తారు. అనంతరం అదే రోజు సాయంత్రం వేలాది మంది భక్తుల సమక్షంలో ఆలయం కింద కల్యాణ వేదికలో వేడుకను నిర్వహిస్తారు. సాయంత్రం జరిగే కల్యాణలో ప్రభుత్వం తరఫున తహసీల్దార్ పట్టువస్త్రాలు, తలంబ్రాలను స్వామివారికి సమర్పిస్తారు. కాగా నవమి రోజున మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో కొనసాగిస్తారు.


గర్భగుడిలో కొలువైన స్వామివారు

ఏర్పాట్లు పూర్తి

శ్రీ రామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు వేలాదిమంది భక్తజనంతో పాటు.. ప్రముఖులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆలయాలు ముస్తాబు

ఆమనగల్లు: శ్రీ రామనవమిని పురస్కరించుకుని నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్, శ్రీ భక్తమార్కండేయస్వామి, పట్టణ సమీపంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, అయ్యసాగరంలోని రామాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య దేవతామూర్తుల పెళ్లి జరపనున్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి భక్తులు తరలిరావాలని నిర్వాహకులు కోరారు.


ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం


ప్రతిజ్ఞ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

కందుకూరు: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ఇన్‌చార్జి వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ మహనీయుల ఆశయాలను సాధించాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజల హక్కులను హరించే కుట్రలో భాగమే స్వాతంత్ర్య పితామహుడు గాంధీజీని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దేశం మరిచిపోయేలా బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. వారి కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యతను కాంగ్రెస్ తీసుకుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ చిగురింత పారిజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, డైరెక్టర్లు సురేందర్, ప్రశాంత్, విష్ణువర్ధన్‌రెడ్డి, పుష్పదర్శన్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీది అప్రజాస్వామిక పాలన'

మహేశ్వరం: దేశంలో ప్రధాని మోదీ పాలన అప్రజాస్వామికంగా కొనసాగుతోందని జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఇన్‌చార్జి వినోద్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించి జల్‌పల్లి మున్సిపాలిటీలోని మరాఠా భవన్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం, అంబేడ్కర్‌పై హోంమంత్రి అమిత్ షా సహా బీజేపీ చేస్తున్న అంతర్గత దాడి, దేశాన్ని ముక్కలు చేసే కుట్రపై కాంగ్రెస్ అగ్ర నాయకత్వం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టిందన్నారు. కులగణన చేసి తెలంగాణలో రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు కల్పించి సీఎం రేవంత్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌లను దేశం మరిచిపోవాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, షేక్ జహంగీర్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, యాదగిరి, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మన్న రవికుమార్‌తో పాటు శ్రీనివాస్, నవీన్‌గౌడ్, అబ్దుల్ రవూఫ్, యూసుఫ్ ఖాద్రీ, అహ్మద్ బామ్, బారీ, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు

సన్నబియ్యంపై తప్పుడు ప్రచారం తగదు


జిల్లెలగూడలో రేషన్‌షాపు వద్ద ప్రధాని ఫొటో ఏర్పాటు చేస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే ప్రజలకు అందజేస్తోందని ఆ పార్టీ మీర్‌పేట కార్పొరేషన్- 1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్‌ముదిరాజ్ అన్నారు. కార్పొరేషన్‌లోని పలు రేషన్‌షాపులలో శుక్రవారం మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సన్నబియ్యాన్ని తామే ఇస్తున్నట్లు కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమేశ్వర్, గాజుల మధు, సత్తయ్య, కాశీరాం యాదవ్, గోపినాథ్, సిద్దాల శ్రీనివాస్, ద్యాసాని తిరుపతిరెడ్డి, దినేశ్, కోట్ల గోపాల్, ఆకుల రాజు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బియ్యం పంపిణీ పరిశీలన

ఇబ్రహీంపట్నం: రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరిశీలించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు ఇబ్రహీంపట్నం 7వ వార్డులోని షాప్‌నకు ఎమ్మెల్యే రానున్నారని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ను గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

క్రీడా పరికరాలు అందజేత

యాచారం: పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆటోనగర్‌కు చెందిన నక్క వెంకటమ్మ, యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనువాస్ యాదవ్.. మొండిగౌరెల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.లక్ష పైగా విలువ చేసే వంట సామగ్రి, క్రీడా పరికరాలు, ఫ్యాన్లు అందజేశారు. అనంతరం దాత మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా సర్కారు బడుల బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలకు సామగ్రి, విద్యార్థులకు స్టేషనరీ, క్రీడా పరికరాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్, మండల విద్యాధికారి పాండు రంగారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీలత, కళమ్మ, మంజుల, లలిత, పాఠశాల చైర్మన్ అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అంతరాయం నేడు

కందుకూరు: విద్యుత్ టవర్ల నిర్మాణంలో భాగంగా శనివారం మండల పరిధిలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు కందుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కందుకూరు, దెబ్బడగూడ, నక్కలబావి, కొత్తూర్ ఫీడర్ల పరిధిలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాచులూరు సబ్ స్టేషన్ పరిధిలో రాచులూరు, తిమ్మాపూర్, తుర్కగూడ అగ్రికల్చర్ ఫీడర్లకు, లేమూరు సబ్‌స్టేషన్ పరిధిలో సరస్వతిగూడ, బైరాగిగూడ ఫీడర్లకు, గూడూరు సబ్‌స్టేషన్ పరిధిలో కటికపల్లి, బండమీద గూడూరు అగ్రికల్చర్ ఫీడర్లకు, గుమ్మడవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కొలన్‌గూడ, మాదాపూర్, బేగంపేట అగ్రికల్చర్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.


బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్

ఆమనగల్లు: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు అండేకార్ యాదీలాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప, సూపరింటెండెంట్ మురళీధర్, ఎన్నికల అధికారి లక్ష్మణశర్మ, మాజీ అధ్యక్షుడు జగన్‌ల సమక్షంలో అధ్యక్షుడిగా యాదీలాల్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా కృష్ణ, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడిని గజమాలతో సత్కరించారు. కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఆమనగల్లు అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, విజయ్‌కుమార్, శేఖర్, మల్లేశ్, న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావ్, లక్ష్మీనారాయణ, వెంకట్‌గౌడ్, జానకిరాములు, భాస్కర్‌రెడ్డి, జమీల్, కృష్ణయ్య, మల్లేశ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి విరమణ సహజమే

మండల విద్యాధికారి చంప్లా నాయక్

తలకొండపల్లి: ప్రతి ఉద్యోగికి విరమణ సహజమేనని ఎంఈఓ చంప్లా నాయక్ అన్నారు. విధినిర్వహణలో అందించిన సేవలే గుర్తింపు తెస్తాయని పేర్కొన్నారు. చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామనాథం ఉద్యోగ విరమణ నేపథ్యంలో శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. చేసిన పనులే మనల్ని ఉత్తములుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. రామనాథం తన ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణతో మెలుగుతూ.. విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించారని, ఉత్తములుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆయన శేషజీవితం ప్రశాంతంగా కొనసాగాలన్నారు. అనంతరం రామనాథం దంపతులను ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాడ్గుల ఎంఈఓ సర్దార్ నాయక్, జీహెచ్ఎం తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి గిరిధర్, టీచర్స్ యూనియన్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి, ఎమ్మార్సీ స్టాఫ్ శ్రీశైలం, మల్లయ్య, సీఆర్పీస్ ప్రవీణ్, విజయ్, శేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


హెచ్ఎం దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

ఆస్తి పన్ను వసూలుపై నజర్

రాయితీపై ముమ్మర ప్రచారం

ఇబ్రహీంపట్నం: ఆస్తి పన్ను వసూలుపై మున్సిపాలిటీ యంత్రాంగం దృష్టి సారించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో పాత బకాయి కలుపుకొని రూ.11.50 కోట్ల పన్ను లక్ష్యానికి.. తొలిసారిగా రూ.5.70 కోట్లను వసూలు చేసి, రికార్డు సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 2025- 26 ఆర్థిక సంవత్సరం టార్గెట్ రూ.11.95 కోట్లు కాగా.. మునుపటి ఉత్సాహంతో కనీసం రూ.6 కోట్లు వసూలు చేయాలని పుర అధికారులు కృతనిచ్చయంతో ఉన్నారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నును ఈ నెల 30లోగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీని(ఎర్లీ బర్డ్ పేరుతో) ఇవ్వనున్నట్లు మున్సిపల్ శాఖ ప్రకటించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. పలుచోట్ల బ్యానర్లు కట్టి ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్రసాగర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుపై సూచించిన తేదీలోగా చెల్లించిన వారికి రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. సోమవారం నుంచి వార్డుల వారీగా ప్రత్యేక బృందాలు ఇంటింటికి వెళ్లనున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సకాలంలో పన్ను చెల్లించి, రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


విద్యార్థులతో ఎంపీడీఓ సరిత, ఎంఈఓ నర్సింహ తదితరులు

ఎంపీడీఓ సరిత

కందుకూరు: విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఎంపీడీఓ సరిత, ఎంఈఓ నర్సింహ, ఎస్ఐ సైదులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్, కళాశాలలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు చెడువైపు వెళ్లకుండా సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పోషకాహార నిపుణుడు రవీందర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కడ్తాల్: రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న బాల్య మిత్రులు ఆనందోత్సాహాలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001- 02 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థులు.. శుక్రవారం మండల పరిధి మైసిగండిలోని ఓ ఫంక్షన్ హాలులో సందడి చేశారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ, ఆటపాటలతో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా తోటి మిత్రుడు బావండ్లపల్లి ఆనంద్.. వైస్ ఎంపీపీగా కడ్తాల్ మండలానికి చేసిన సేవలను కొనియాడుతూ.. ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి, నిరంజన్, ఈశ్వరయ్య, మాధవరెడ్డి, జగత్‌రెడ్డి, పాండయ్య, రామనాథం, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు కరుణాకర్, ఆనంద్, లక్ష్మణ్, బాలకృష్ణ, ధర్మ, రంగ్యా, శ్రీను, వెంకటేశ్, జంగయ్య తదితరులు ఉన్నారు.